బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని కలిసిన పార్టీ నాయకులు

మంచాల, మార్చి 29: భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించడంతో శుక్రవారం మండల పరిధిలోని తిప్పాయిగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకులు మల్లేశ్‌ను నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పార్లమెంట్ అభ్యర్థిగా బీసీ నాయకుడిని నియమించినందుకు అతడి విజయం కోసం అందరం సైనికుల్లా పనిచేస్తామని చెప్పారు. క్యామమల్లేశ్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు శ్రీను, మల్లేశ్, శ్రీశైలం, మల్లేశ్, శివకుమార్, స్వామి, యాదగిరి, రవి, మల్లేశ్ ఉన్నారు.

వ్యాపారులు లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవాలి

కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయాంజాల్, మార్చి 29 : 2024-2025 ఆర్థిక సంవత్సరానికి వ్యాపార లైసెన్స్‌లు ఈ నెల 31 తేదీలోపు పునరుద్ధరించుకోవాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు పునరుద్ధరించుకోని వారికి ఏప్రిల్ 1 తరువాత 25 పెనాల్టీ విధిస్తామని ఆయన పేర్కొన్నారు. పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా వ్యాపార లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవడంతో వారిని కమిషనర్ అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు

ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్

ఆమనగల్లు, మార్చి 29: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ అన్నారు. డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమల్‌హాసన్‌రెడ్డి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ ఆదేశాల మేరకు ఆమనగల్లు ఎస్‌హెచ్‌వో పరిధిలోని నాలుగు మండలాలైన ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల్లో ఐదు బృందాలుగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు. కాట్రావత్ తండాలో మద్యం 4 లీటర్లు సీజ్ చేసి నిర్వాహకులు గోపాల్, మాలిలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అదే విధంగా కొర్రతండాలో 4 లీటర్ల సారాను సీజ్ చేసి నిర్వాహకులు బలరాం, శంకర్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా కొర్రతండాగుట్టల్లో 200 లీటర్ల బెల్లం పానకం గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పర్మిషన్ లేకుండా ఫంక్షన్ హాల్, ఫామ్‌హౌస్‌లో నిర్వహించే ఈవెంట్లల్లో లిక్కర్ ఉంటే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కువ మొత్తంలో లిక్కర్ క్వారీ చేసినా, స్టోర్ చేసినా తమకు సమాచారం అందజేయాలని కోరారు. ఈ తనిఖీల్లో రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం ఇన్‌చార్జి చంద్రశేఖర్, సీఐ సత్యనారాయణ, సీతారంరెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఆదిబట్ల, మార్చి 29 : గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డ ఇద్దరిని అరెస్ట్ చేసిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం గురువారం రాత్రి ఆదిబట్ల బీరప్పగుడి నుంచి నాదర్‌గుల్ వెళ్లే దారిలో ఇద్దరిపై అనుమానం రావడంతో ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్ తమ సిబ్బందితో తనిఖీ చేసి పట్టుకున్నారు. హైదరాబాద్, ధూల్‌పేట్‌కు చెందిన రాజూసింగ్ నుంచి 2 కేజీల గంజాయితోపాటు సెల్‌ఫోన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా, కందుకూరు గ్రామానికి చెందిన ఉప్పు లోకేశ్వర్ నుంచి 1.2కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే ధూల్‌పేట్‌కు చెందిన రాజూసింగ్ ఆరు సంవత్సరాలుగా వినాయకుల ప్రతిమలను తయారు చేసేవారి వద్ద పని చేసేవాడు. గంజాయి అమ్మడం వ్యాపారంగా చేసుకొని ఆశీష్‌సింగ్, భీజ్మా భాయి అనే వ్యక్తుల నుంచి గంజాయిని రూ.10వేలకు కొనుగోలు చేసి హైదరాబాద్ చుట్టు పక్కల కేజీ రూ.15వేలకు అమ్ముతూ డబ్బులు సంపాదించేవాడు. ఆ క్రమంలో గంజాయి తాగే అలవాటు ఉన్న మరోవ్యక్తి ఉప్పు లోకేశ్వర్ అతడి వద్ద 6 నెలలుగా గంజాయి కొని తాగేవాడు. వారం రోజుల క్రితం రాజూసింగ్ వద్ద 1.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి 50 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి ఆదిబట్ల చుట్టుపక్కల కంపెనీల్లో పని చేసే బబ్లూ, సంతోష్, సెల్వా, శివ, కరణ్, అప్పు, మీనాజ్ అనే వ్యక్తులకు అమ్మేవాడు. తిరిగి వారు వారికి పెద్ద మొత్తంలో 4 కేజీల గంజాయి కావాలని కోరారు. దీంతో లోకేశ్వర్ ధూల్‌పేటలో ఉన్న రాజూసింగ్‌కి ఫోన్ చేసి తన దగ్గర 2 కేజీల గంజాయి ఉన్నదని చెప్పగా, లోకేశ్వర్ తన దగ్గర మిగిలిన 1.2 కేజీల గంజాయితో ఆదిబట్లలోని బీరప్పగుడి వద్ద కలిసి విక్రయించేందుకు నిర్ణయించారు. సమాచారం అందుకున్న ఆదిబట్ల పోలీసులు బీరప్పగుడి వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుంచి 3.2 కేజీల గంజాయిని రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రంగస్థల కళాకారులను గౌరవించుకోవాలి



గోపాల కృష్ణను సన్మానిస్తున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

వనస్థలిపురం, మార్చి 29: రంగస్థల కళాకారులను గౌరవించుకోవాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార అన్నారు. వనస్థలిపురంలో శక్రవారం రంగస్థల నటుడు, తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ మల్లాది గోపాల కృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్థలం మన ప్రాచీన కళ అన్నారు. దానిని పరిరక్షించుకుని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. గోపాల కృష్ణ లాంటి రంగస్థల నటులు నాటక రంగానికి ఎన్నో సేవలందించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణాదిశేషు, ఆకృతి సుధాకర్, చేపూరి శంకర్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విన్యాసాలు.. కమిషనర్లకు నెటిజన్ల ట్వీట్

రోడ్లపై అర్ధరాత్రి వాహనాలతో విన్యాసాలు చేస్తున్న యువకులు

బండ్లగూడ, మార్చి 29: రోడ్లపై యువకులు బైక్‌లపై విన్యాసాలు చేస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లర్ నం:140 నుంచి 170 వరకు యువకులు బైక్‌లపై ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ, ఇష్టారాజ్యంగా వ్య వహరిస్తున్నారు. ఈ సమయంలో భయాందోళనకు గురైన తోటి వాహనదారులు వారి విన్యాసాలను వీడియోలు తీసి ట్విట్టర్ ద్వారా సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లకు ట్యాగ్ చేశారు. తోటి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఉన్నాతధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులు దీనిపై సంబంధిత పోలీస్‌స్టేషన్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌కు అధికారమిస్తే.. తాగు, సాగు నీటికి కరువే

శంషాబాద్ రూరల్, మార్చి 29: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తాగు, సాగునీరు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్క వేణుగోపాల్ అన్నారు. శంషాబాద్ పట్టణంలోని బేగం ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ బూత్ ఇన్‌చార్జిలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన.. మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కేంద్రంలో మరోసారి మోదీని ప్రధాన మంత్రిని చేయాలని సూచించారు. భారతదేశం అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేదలకు అందడంతో పాటు దేశం రక్షణగా ఉండటం కోసం బీజేపీని గెలిపించే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు వడ్డె చంద్రయ్య, ఎంపీటీసీ బుక్క ప్రవీణ్, ఎన్.కుమార్‌యాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలకళ తప్పిన పల్లె చెరువులు

మండుటెండలతో ఎండుతున్న జలసిరులు

చెరువుల కింద బోరుబావుల్లో తగ్గుతున్న భూగర్భ జలాలు

మొయినాబాద్‌లోని సురంగల్ పెద్ద చెరువులో నేటి పరిస్థితి

నిండుకుండలా మొయినాబాద్‌లోని సురంగల్ పెద్ద చెరువు (ఫైల్)

మొయినాబాద్, మార్చి 29 : చెరువుల్లో రోజు రోజుకూ నీటి మట్టం తగ్గుతూ జలకళను కోల్పోతున్నాయి. గతంలో ఎండాకాలంలో సైతం నీటితో కళకళలాడిన చెరువులు మార్చి చివరి వరకు చెరువుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. చెరువుల్లో నీటి మట్టం తగ్గుతున్న కొద్దీ చెరువుల కింద ఉన్న బోరుబావుల్లో సైతం భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. గత ప్రభుత్వం చెరువులను మిషన్ కాకతీయ పథకం కింద చెరువులు పునరుద్ధరించింది. వర్షాలు కూడా సమృద్ధిగా కురవడంతో పల్లె చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు మార్చి చివరినాటికే ఎండుముఖం పట్టాయి. ఏప్రిల్ రెండవ వారం వరకు చెరువుల్లో చుక్క నీరు కూడా కనిపించని పరిస్థితి నెలకొననున్నది. దీంతో చెరువుల కింద వ్యవసాయ బోరులు సైతం ఎండిపోయే ప్రమాదం కూడా ఉంది.

జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

మండలంలో సురంగల్, చిలుకూరు, నక్కలపల్లి, హిమాయత్‌నగర్, చిన్నమంగళారం గ్రామాల్లోని చెరువుల్లో గతంలో మత్స్యకారులు చేప పిల్లలను వదిలి ఉపాధి పొందారు. సురంగల్ పెద్ద చెరువులో మత్స్యకారులు చేప పిల్లలను గత మూడు ఏండ్ల నుంచి వదిలి చేపలను పెంచుకుని ఉపాధి పొందారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లతో పాటు మత్స్యకారులు సొంతంగా మరికొన్ని చేప పిల్లలను తీసుకొచ్చి చెరువులో వదిలి పెంచుకుని ఆదాయం పొందారు. కానీ ఇప్పుడు చెరువులు ఎండు ముఖం పట్టడంతో జీవనోపాధి కోల్పోతామని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. అదే విధంగా హిమాయత్‌నగర్, నక్కలపల్లి, చిలుకూరు చెరువుల్లో మత్స్యకారులు చేప లను పెంచి ఉపాధి పొందారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, మార్చి29: మండలంలోని మాల్, నల్లవెల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సందీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో కొత్త సర్వీస్ కనెక్షన్లు ఇవ్వడానికి, ఫీడర్‌లో మరమ్మతులను చేపట్టడానికి 30నిమిషాల పాటు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. మాల్‌లో ఉదయం 7 నుంచి ఉదయం 7.30గంటల వరకు, నల్లవెల్లిలో ఉదయం 8నుంచి ఉదయం 8.30గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయన్నట్లు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి, ఇంజినీర్లకు అన్ని విధాలుగా సహకరించాలని ఆయన కోరారు. సీనియర్ ఇంజనీర్లు అందుబాటులో ఉండటంతో విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

రేపు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 29 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 54వ మహాజన సభను మండల కేంద్రంలోని సంఘం ఆవరణలో ఆదివారం 31న ఉదయం 11.30 గంటలకు చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మేనేజర్ ఐలేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం వ్యవహారాలు, జమాఖర్చులపై నివేదిక సమర్పణ, ఆడిట్ రిపోర్టును సర్వసభ్య ఆమోదం, అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సంఘం పాలకవర్గ సభ్యులు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విద్యార్థినులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సంపాదకుడు సతీశ్‌చందర్

మొయినాబాద్, మార్చి 29 : విద్యార్థినులు మేధాసంపదను పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ రచయిత, కవి, సీనియర్ సంపాదకుడు సతీశ్‌చందర్ అన్నారు. మండల పరిధిలోని తోలుకట్టా సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల పాఠశాలలో స్పార్కల్స్ అనే పేరుతో వేసవి శిబిరాన్ని 15 రోజులుగా నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బాలికలు జ్ఞానాన్ని సంపాదించుకుంటే ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశం ఉందని తెలిపారు. జ్ఞానం పెంచుకోవడానికి పుస్తకాలను చదివే అలవాటు పెంచుకోవాలన్నారు. గురుకుల విద్యా సంస్థల్లో విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీవో శారదావెంకటేశ్, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

మొయినాబాద్, మార్చి 29 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పేద ప్రజలకు సేవలు అందించాలని చేవెళ్ల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామన భీంభరత్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన కట్ట మీది ప్రకాశ్, కట్టమీది శ్రీనివాస్ కలిసి కట్ట మీది నరసింహ, సత్తమ్మల జ్ఞాపకార్థం హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో చిలుకూరు మాజీ సర్పంచ్‌లు వీరభద్రస్వామి, వెంకటరెడ్డి, నాయకులు రవియాదవ్, కుమార్‌యాదవ్, రాజుగౌడ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్, రాజు, ప్రవీణ్, షాబాద్ మధు, ఎల్లేశ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

చర్చిల్లో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

షాబాద్ : మరియాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 29: గుడ్ ఫ్రైడేను పట్టణంలోని చర్చిల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని జియోన్ ఎంబీ చర్చిలో క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా యేసుప్రభు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ కృష్ణపాల్, చర్చి చైర్మన్ ఎం.ఆర్ స్టీఫెన్, వైస్ చైర్మన్లు జి.జె జ్ఞానప్రకాశ్, బిల్లీ గ్రాహం, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఐజాక్, అసిస్టెంట్ కోశాధికారి పారంజ్యోతి, సభ్యులు జోసెఫ్, మనోహర్, రాజేశ్, కవిరాజు, ప్రభాకర్, ధీరజ్, రంగన్న, సంపత్‌కుమార్, ఇమాన్యుల్, క్రిస్టఫర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

షాబాద్‌లో

షాబాద్ : షాబాద్ మండలంలో గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మరియాపురం, షాబాద్, గోపిగడ్డ తదితర గ్రామాల్లో క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుడ్‌ఫ్రైడే విశిష్టతను పాస్టర్లు ప్రజలకు వివరించారు.

ఆమనగల్లు: క్రైస్తవులు అత్యంత పర్వదినంగా చేసుకునే పండుగల్లో గుడ్ ఫ్రైడే ఒకటి. ఈ పండుగ సందర్భంగా మండలంలోని క్రైస్తవులు అందరూ అన్ని చర్చిల్లో ప్రభువును స్మరించుకొన్నారు.

మొయినాబాద్ : మండల కేంద్రంలోని మెథడిస్ట్ చర్చిలో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మూడు షాపుల్లో చోరీ

చేవెళ్లటౌన్, మార్చి 29: ఒకే రోజు మూడు షాపులో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసిన ఘటన చేవెళ్లలో జరిగింది. ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల కేంద్రంలోని మనీ ట్రాన్స్‌ఫార్మర్ షాపులో సీసీ కెమెరా హార్డ్ డిస్క్, ఇంటర్నెట్ బాక్స్, మణికంఠ ట్రేడర్స్‌లోని కిరాణా సామన్లు, నగదు, విక్రమ్ కూల్ పాయింట్‌లో సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌తో పాటు మొత్తం 50వేల నగదును గుర్తు తెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి దొంగలించారని పోలీసులు తెలిపారు. షాపు యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించొద్దు

హిమాయత్‌నగర్, మార్చి 29: నగరంలోకి పొరుగు జిల్లాల ఆటోలను అనుమతించకుండా నగర పోలీస్ కమిషనర్, ఆర్‌టీఏ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడలోని ఎన్ ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీలేక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో పొరుగు జిల్లాలలో రిజిస్టరైన వేలాది ఆటోలు నగరంలోకి రావడంతో ఇక్కడి ఆటో డ్రైవర్లకు మరింతగా గిరాకీలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఓలా, ఊబేర్, ర్యాపిడో క్యాబ్‌ల యాజమాన్యాలు చేసే దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో జేఏసీ నాయకులు కె.లక్ష్మినర్సయ్య, ఎస్‌కే జమా, మహ్మద్ అజీమోద్దిన్, షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేత

దేవాలయ నిర్మాణం కోసం విరాళం అందజేసిన అనంతరెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చేవెళ్లటౌన్, మార్చి 29: చేవెళ్ల మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం చేవెళ్లలోని పురాతన దేవాలయం అయిన మల్లన్న స్వామి దేవాలయ నిర్మాణం కోసం చేవెళ్ల గ్రామానికి చెందిన అత్తేల్లి అనంతరెడ్డి, రూ.లక్ష, అత్తేల్లి జగన్నాథ్‌రెడ్డి రూ.50వేలు, సంతోషి మాతా వే బ్రిడ్జి ఓనర్ వెంకట్‌రెడ్డి రూ.51వేలను దేవాలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, మార్చి29 : వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురి నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో సుమధుర ఆర్ట్స్ అకాడమీ గురువులు శ్రావ్య మానస శిష్య బృందం కూచిపూడి, జానపద నృత్యాలతో అలరించారు. కళాకారులు నారాయణ అచ్యుత, అన్నమయ్య సంకీర్తనలు, ఏకదంతాయ, శ్రీమన్నారాయణ, కొలువైతివారంగా సాయి, గణేశవా పంచరత్న అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించగా, మేడారం జాతర, గుజ్జరి, చందనలో అంశాలను జానపద నృత్యరూపకంలో ప్రదర్శించి అలరించారు.

వీధి కుక్కల తరలింపు

నందిగామ, మార్చి 29 : నందిగామ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని జంగోనిగూడ, అంతిరెడ్డిగూడ, అయ్యప్ప టెంపుల్, పిట్టలగూడ గ్రామాల్లోని వీధుల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రత్యేక బృందాలతో కుక్కలను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నామని, ఇప్పటి వరకు సుమారు 300 కుక్కలను అటవీ ప్రాంతాలకు తరలించినట్లు నందిగామ పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

ఆకట్టుకుంటున్న రామాయణ కల్పవృక్షం

మాదాపూర్, మార్చి 29: సంగీతం, నృత్య ప్రదర్శనలతో కళాకారులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, శంకరానంద కళాక్షేత్ర నాట్యరంభ, భృత్ సహకారంతో రామాయణ కల్పవృక్షం పేరిట సంగీత నాట్య కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి విచ్చేసి కళాకారిణి ఆనంద శంకర్ జయంత్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్రీరామ నామం, ఎంత రుచి రా సంగీతానికి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. ఈ కార్యక్రమం ఈనెల 31వ తేదీ వరకు జరగనున్నది. వినయ్ వారణాసి, వివేక్ సదాశివమంద్ ధృవ శ్రీరామ రక్ష, కథలు, సంగీతం, హనుమంతుడిపై పలు భక్తి పాటలు వంటివి జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మరో రెండు రోజులే గడువు

ఇప్పటి వరకు రూ. 244 కోట్ల ఆస్తిపన్ను వసూలు

90 శాతం రాయితీని వినియోగించుకోవాలంటున్న అధికారులు

ఎల్బీనగర్ , మార్చి 29 : ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులు యుద్ధ ప్రాతిపదికన రోజువారీ టార్గెట్లతో ముందుకు సాగుతున్నారు. పాత బకాయిలపై వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీని కూడా జీహెచ్ ఎంసీ అధికారులు అందిస్తుండటంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. మరో రెండు రోజులే అవకాశం ఉండటంతో ఆస్తి పన్నులను చెల్లించి లాభం పొందాలని అధికారులు కోరుతున్నారు. ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో కలిపి టార్గెట్ రూ. 320. 94 కోట్లు ఉండగా ఇప్పటివరకు వరకు అధికారులు రూ. 244.59 కోట్లను వసూళ్లు చేశారు. ఇక మిగిలిన ఈ రెండు రోజుల్లో మార్చి 31 వరకు ఇంకా రూ. 76.35 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. గడువు రెండు రోజులే ఉండటంతో అధికారులు పన్ను వసూళ్లపై మరింత వేగం పెంచారు.

బకాయిలు చెల్లించాలి

ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా ఆస్తిపన్ను బకాయిలను మార్చి 31వ తేదీలోపు చెల్లించాలి. ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ రాయితీ 90 శాతం అందిస్తున్నందున అందరూ ఈ రెండురోజుల్లో సద్వినియోగం చేసుకుని పన్ను బకాయిలను చెల్లించి జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలి.

– ముకుందరెడ్డి, జోనల్ కమిషనర్

సర్కిళ్ల వారీగా..

సర్కిళ్ల వారీగా తీసుకుంటే కాప్రా సర్కిల్‌లో టార్గెట్ రూ. 65.63 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 53.76 కోట్లు వసూళ్లు చేశారు. ఉప్పల్ సర్కిల్‌లో టార్గెట్ రూ. 43.10 కోట్లు ఉండగా ఇప్పటివరకు రూ. 33.59 కోట్లు, హయత్‌నగర్ సర్కిల్‌లో టార్గెట్ రూ. 74.01 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 65.18 కోట్లు వసూళ్లు చేశారు. ఎల్బీనగర్ సర్కిల్‌లో టార్గెట్ రూ. 62.56 కాగా ఇప్పటివరకు రూ. 43.27 కోట్లు, సరూర్‌నగర్ సర్కిల్‌లో టార్గెట్ రూ. 75.63 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 49.29కోట్లను వసూళ్లు చేశారు. ఇక రెండు రోజుల్లో కాప్రా సర్కిల్‌లో రూ. 11.87 కోట్లు, ఉప్పల్ సర్కిల్‌లో రూ. 9.51 కోట్లు, హయత్‌నగర్ సర్కిల్‌లో రూ. 8.83 కోట్లు, ఎల్బీనగర్ సర్కిల్‌లో రూ. 19.29 కోట్లు, సరూర్‌నగర్ సర్కిల్‌లో రూ. 26.34 కోట్ల బకాయిలు వసూ